క్లుప్తంగా

గ్రామసభల్లో తీర్మానం మేరకు పనులు



మాట్లాడుతున్న ఈఓపీఆర్‌డీ కుమారవర్మ

సీతానగరం: ప్రజలు ఎదుర్కొంటున్న సామాజిక పరమైన సమస్యలను గ్రామసభల్లో ప్రజా మోదం పొందిన తరువాత అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపట్టాలని ఈఓపీఆర్‌డీ కె.కుమారవర్మ అన్నారు. కాశీపేటలో సర్పంచ్ తేలు ధనంజయమ్మ అధ్యక్షతన పంచాయతీ కార్యదర్శి మురళి గ్రామసభ శనివారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన కుమారవర్మ మాట్లాడుతూ గ్రామాభివృద్ధి పనులకు చట్టబద్ధత కల్పిస్తూ గ్రామసభలు నిర్వహించడం తొలి విడతగా జరుగుతున్నాయని తెలిపారు. పంచాయతీలో 29 శాఖల ద్వారా అమలు జరుగుతున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాల గురించి సమీక్షించినట్టు తెలిపారు. పంచాయతీ పాలకవర్గ సభ్యులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

పెంపకందారులు జాగ్రత్తలు పాటించాలి

పార్వతీపురం టౌన్: పురపాలక సంఘం పరిధిలో పశువుల పెంపకందారులు, పందుల, కుక్కల పెంపకందారులు తమ జీవాలను అదుపులో ఉంచాలని మున్సిపల్ అధికారులు సూచించారు. వీటిని పెంపకందారులు ఇళ్ల వద్దనే లేదా ఇతర ప్రదేశాల్లో పెంచుకోవాలని, రహదారులపైకి విడిచిపెట్టరాదని కోరారు. విచ్చలవిడిగా వీటిని విడిచిపెడితే పాదచారులకు, ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదని దీన్ని దృష్ట్యా వాటిని అదుపులో ఉంచుకోవాలని కోరారు. విచ్చలవిడిగా విడిచిపెడితే జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు. పెంపుడు కుక్కలకు యాంటీ రాబిస్ టీకా వేయించాలని సూచించారు.

సంఘ విద్రోహ చర్యలకు దూరంగా ఉండండి


- యువతకు డీఎస్పీ సుభాష్ పిలుపు



మాట్లాడుతున్న డీఎస్పీ సుభాష్

పాచిపెంట: సంఘ విద్రోహ చర్యలకు యువత దూరంగా ఉండాలని పార్వతీపురం డీఎస్పీ సుభాష్ అన్నారు. మండలంలోని కొటికిపెంట పంచాయతీ కొత్తవలసలో మన ఊరు మన పోలీస్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ సుభాష్ మాట్లాడుతూ యువత పోలీసులతో స్నేహభావంతో మెలగాలన్నారు. గ్రామాల్లో సారా అమ్మకాలు చేపడితే మహిళలు స్థానిక ప్రజలు స్వచ్ఛందంగా వ్యతిరేకించాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ వెంకటరమణ, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

మట్టి నమూనాల సేకరణపై అవగాహన



సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న ఏడీఏ శారద

పార్వతీపురం టౌన్: మట్టి నమూనాల సేకరణపై మండల వ్యవసాయ అధికారిని పర్యవేక్షణలో డీటీసీ ఏడీఏ శారద అధ్యక్షతన శనివారం అవగాహన కల్పించారు. వీఏఏ, వీహెచ్ఈఏలకు మట్టి నమూనా సేకరణ విధానం, పరిశీలనపై అవగాహన కల్పించారు. భూ ఆరోగ్య కార్డు ఆధారంగా భూముల్లో ఎరువులు వేయాలని సూచించారు. ఎంఏఓ ఆర్.రేఖ, మాస్టర్ ట్రైనీ ఎస్.బాలకృష్ణ, వీఏఏలు, వీహెచ్ఏలు పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలలో మెరుగైన విద్య



తుమరాడలో విద్యార్థులతో మాట్లాడుతున్న అధ్యాపకులు

పాలకొండ రూరల్: కార్పొరేటు కళాశాలలకు దీటుగా ప్రభుత్వ కళాశాలల్లో మెరుగైన బోధన అందుతోందని అధ్యాపకులు వెంకటేశ్వర రావు, వెలమల అప్పారావు తదితరులు స్పష్టం చేశారు. మండలంలోని తంపటాపల్లి, తుమరాడ, అంపిలి, వడమ ప్రాంతాల్లో శనివారం పర్యటించారు. 10వ తరగతి పరీక్షలు రాసిన విద్యార్థులు, వారి తల్లితండ్రులను కలిసి మాట్లాడారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అందుబాటులో ఉన్న కోర్సులు, విద్యాబోధన, ప్రభుత్వం కల్పిస్తున్న వసతులను వివరించారు. పిల్లలను ప్రభుత్వ కళాశాలలో చేర్పించాలని కోరారు. అధ్యాపకులు శ్రీనివాసరావు, గిరిబాబు, శివానంద్ తదితరులున్నారు.

మంచి చేస్తున్న జగనన్నను ఆశీర్వదించండి

- ఉప ముఖ్యమంత్రి రాజన్నదొర



జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో జగన్ స్టిక్కర్‌లను అతికిస్తున్న ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర

సాలూరు: రాష్ట్రంలో సంక్షేమ, అభివృద్ధి పాలన అందిస్తూ ప్రజలకు మంచి చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలు మద్దతుగా నిలిచి ఆశీస్సులు అందించాలని ఉప ముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పీడిక రాజన్నదొర అన్నారు. సచివాలయ పట్టణ కన్వీనర్ గిరి రఘు ఆధ్వర్యంలో పట్టణంలో చిట్టువీధి, తెలగావీధి, పెదకోమటిపేట, వడ్డీవీధి, లావుడి వీధులలో శనివారం నిర్వహించిన జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి పాల్గొన్నారు. ప్రజలతో మాట్లాడి చంద్రబాబు, జగన్‌మోహన్‌రెడ్డి పాలనల మధ్య వ్యత్యాసాన్ని వివరించారు. పార్టీలకతీతంగా అర్హతే ప్రామాణికంగా, అత్యంత పారదర్శకంగా, అవినీతి రహితంగా జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ, అభివృద్ధి పాలనను వివరిస్తూ, ప్రజల నుండి అభిప్రాయాలను సేకరించారు. ప్రజలకు కరపత్రాలు పంపిణీ, సెల్ఫీ తీసుకోవడం, సెల్ నంబరుకు మిస్డ్ కాల్ ఇవ్వడం, స్టిక్కర్ అంటించారు. ప్రజలకు మేలు చేయడం జగన్‌మోహన్‌రెడ్డి తత్వమని, ప్రజలను మోసం చేయడం చంద్రబాబు నైజమని ఎద్దేవా చేశారు. పాదయాత్రలో ఇచ్చిన హామీని నెరవేరుస్తూ డీఎస్సీ 1998కు చెందిన వందల మంది అభ్యర్థులకు తద్వారా వారి కుటుంబాలకు జగన్‌మోహన్‌రెడ్డి న్యాయం చేశారని వివరించారు. అన్ని వర్గాల ప్రజలకు మేలు చేస్తున్న జగనన్నకు మద్దతుగా నిలిచి, 2024 ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా మళ్లీ ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ జర్జాపు దీప్తి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు జర్జాపు ఈశ్వరరావు, కౌన్సిలర్లు, నాయకులు శ్రీనివాసరావు, వెంకటరమణ, లక్ష్మణ, రామక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

సీతానగరంలో..



సీతానగరం: లచ్చయ్యపేటలో ఇంటింటికి వెళ్లి జగనన్నే మా భవిష్యత్తు పత్రాలను అందజేస్తున్న జెడ్పీటీసీ బాబ్జీ తదితరులు

సీతానగరం: జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం మండలంలోని లక్ష్మీపురం, గుచ్చిమి, చినబోగిలి, లచ్చయ్యపేట, చెల్లన్నాయుడువలస, పెదంకలాం, కృష్ణారాయపురం, గాదెలవలస, జోగింపేట, మరిపివలస, బూర్జ గ్రామాల్లో శనివారం నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు పాల్గొన్నారు. ఎంపీపీ బి.రవణమ్మ, జెడ్పీటీసీ మామిడి బాబ్జీ, సర్పంచ్‌లు సీహెచ్ కృష్ణ, ఎం.శ్రీదేవి, సత్యవతి కన్వీనరు సీహెచ్ సురేష్, ఎంపీటీసీ పార్వతి తదితరులు పాల్గొన్నారు.

బలిజిపేటలో...



బలిజిపేట: పణుకువలసలో ఇంటింటికి వెళ్తున్న సర్పంచ్, కన్వీనర్లు, గృహసారథులు

బలిజిపేట: మండలంలో వివిధ గ్రామాలలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. పణుకువలసలో సర్పంచ్ విజయ, నాయకులు, కన్వీనర్లు, గృహసారథుల ఆధ్వర్యంలో ఇంటింటా తిరిగి జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, గృహసారథులు, కన్వీనర్లు, వలంటీర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జగనన్న పాలనలో అర్హులందరికీ న్యాయం



ఉప ముఖ్యమంత్రి రాజన్నదొరను సన్మానిస్తున్న నాయకులు

- ఉప ముఖ్యమంత్రి రాజన్నదొర

సాలూరు: రాష్ట్రంలో జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అర్హులందరికీ న్యాయం జరుగుతుందని ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఉప ముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పీడిక రాజన్నదొర అన్నారు. పట్టణంలో ఆయన నివాసంలో సీఐటీయూ అనుబంధ ఏపీ గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం జిల్లా ఉద్యోగులు జి.ఈశ్వరరావు, కార్యదర్శి కృష్ణారావు ఆధ్వర్యంలో శనివారం ఉప ముఖ్యమంత్రిని కలిశారు. వీఆర్ఏల సమస్యలను వివరించారు. జగనన్న పాలనలో తమకు న్యాయం జరుగుతుందని నమ్మకం ఉందన్నారు. ఇప్పటికే చాలా మందికి పదోన్నతులు కల్పించాలని పేర్కొంటూ తమ సమస్యలను పరిష్కరించి న్యాయం చేయాలని కోరారు. సమస్యలపై వినతి పత్రం అందజేశారు.

దీనిపై ఉప ముఖ్యమంత్రి రాజన్నదొర స్పందిస్తూ నిబంధనల మేరకు అర్హులందరికీ న్యాయం జరుగుతుందని స్పష్టం చేశారు. ఇటీవల పలువురు వీఆర్ఏలకు పదోన్నతులపై తాను మాట్లాడిన తరువాత న్యాయం జరిగిన విషయాన్ని గుర్తు చేశారు. పలువురు సంబంధిత పరీక్షలు పాస్ కాకపోవడం వల్ల పదోన్నతులు పొందలేకపోయారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా వీఆర్ఏలు రాజన్నదొరకు సత్కరించారు. ఆయనను కలిసిన వారిలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎస్‌వైనాయుడు, ఇతర నాయకులు ఉన్నారు.

నాడు-నేడు పనులు వేగవంతం చేయాలి



అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న ఎంఈఓ నాగభూషణరావు

గరుగుబిల్లి: నాడు-నేడు రెండో విడత పాఠశాల అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని ఎంఈఓ ఎస్.నాగభూషణరావు అన్నారు. మండలంలోని పెదగుడబ ప్రాథమిక పాఠశాలలో జరుగుతున్న అభివృద్ధి పనులను, మధ్యాహ్న భోజన పథకం నిర్వాహణను శనివారం ఆయన పరిశీలించారు. మండలంలో నాడు-నేడు మొదటి విడతలో 27 పాఠశాలలను అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. రెండో విడతలో 31 పాఠశాలలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. నిర్మాణాలకు అవసరమైన సామాగ్రిని గుత్తేదారులకు సరఫరాచేయడం జరుగుతుందన్నారు. పేద విద్యార్థులకు కూడా కార్పొరేట్ తరహా బోధన అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం పాఠశాలలను అభివృద్ధి చేస్తోందన్నారు.

గ్రామాల్లో డీఐఓ పర్యటన

మక్కువ: గర్భిణులు, చిన్నారులు, బాలింతల్లో రక్తహీనత నివారణే లక్ష్యంగా వైద్య సిబ్బంది పని చేయాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి(డీఐఓ) డాక్టర్ టి.జగన్మోహనరావు సూచించారు. మండలంలోని వెంకటభైరిపురం, కొయ్యానపేట గ్రామాల్లో ఆయన శనివారం పర్యటించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఐరన్, ఫోలిక్ యాసిడ్ మాత్రలు, సిరప్స్ లభ్యత వివరాలను పరిశీలించారు. వాటి వినియోగంపై సిబ్బందిని ప్రశ్నించారు. గర్భిణులు భోజనం తరువాత క్రమం తప్పకుండా ఐరన్ మాత్ర వేయించాలని, ఆరు నెలల నుంచి ఐదేళ్లలోపు పిల్లలకు వారానికి రెండుసార్లు ఐరన్ సిరప్ తప్పకుండా వేయించాలని సూచించారు. గర్భిణులకు, పిల్లలకు కేంద్రాల్లో అందజేసే పౌష్టికాహారం పూర్తి స్థాయిలో వినియోగించడపై దృష్టి పెట్టాలని అంగన్‌వాడీ, వైద్య సిబ్బందికి సూచించారు. ఇవన్నీ రక్తహీనత నివారణకు దోహదపడతాయన్నారు. వ్యాధి నిరోధక టీకాలు షెడ్యూల్ ప్రకారం వేయించాలన్నారు. పిల్లలు, గర్భిణుల ఆరోగ్య పర్యవేక్షన రికార్డులను పరిశీలించి ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. అనంతరం పిల్లల ఆరోగ్యాన్ని పర్యవేక్షించారు. సామ్, మామ్‌గా గుర్తించిన పిల్లలను జిల్లా ఆస్పత్రిలో ఎన్ఆర్‌సీ కేంద్రాల్లో అడ్మిట్ చేయాలని అన్నారు. వైద్యాధికారి డి.కిరణ్‌కుమార్‌రెడ్డి, సీహెచ్ఓ పి.శకుంతలమ్మ, వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ సిబ్బంది, 104 సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



పిల్లలకు వైద్య పరీక్షలు చేస్తున్న డీఐఓ

అగ్ని ప్రమాదాలపై అవగాహన కార్యక్రమాలు



సాలూరు: అగ్నిమాపక వారోత్సవంలో కరపత్రాల ద్వారా అవగాహన



పార్వతీపురం టౌన్: అగ్ని ప్రమాదాలు జరిగేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

పార్వతీపురం టౌన్: అగ్ని ప్రమాదాలపై అవగాహనా, భద్రత వారోత్సవాలను స్థానిక ఆర్టీసీ ప్రాంగణంలో అగ్నిమాపక శాఖ అధికారులు శనివారం నిర్వహించారు. జాతీయ అగ్నిమాపక వారోత్సవాలను పురస్కరించుకుని ఈ నెల 14 నుండి 20వ తేదీ వరకు అవగాహనా కార్యక్రమాలను చేపడుతున్నామని పార్వతీపురం అగ్నిమాపక అధికారి యు.సుధాకరరావు తెలిపారు. వారోత్సవాలలో భాగంగా ఆయిల్ ట్యాంక్‌లు పేలినప్పుడు, ఎలక్ట్రికల్ పరికరాల వల్ల ప్రమాదం ఏర్పడినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆర్టీసీ సిబ్బందికి, ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని ఆర్టీసీ కాంప్లెక్స్‌లో నిర్వహించారు. గ్యాస్ సిలిండర్ పేలినప్పుడు, అధిక ఉష్ణోగ్రతల వల్ల పొలాల్లో గడ్డివాములు కాలిపోవడం సంభవిస్తుందని, అటువంటి అనుకోని ప్రమాదాలు జరిగినప్పుడు ఆందోళన పడకుండా నియంత్రణ చర్యలు చేపట్టేలా ఆలోచించాలని అన్నారు. చిన్న చిట్కాలు పాటించి పెద్ద ప్రమాదాలు సులభంగా నియంత్రించ వచ్చని చెప్పారు. వివిధ ప్రమాదాల నియంత్రణకు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో ప్రత్యక్ష ప్రదర్శన ద్వారా ప్రజలకు అవగాహనా కల్పించారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది టి.ఉమా మహేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

సాలూరులో...

సాలూరు: అగ్ని ప్రమాదాలపై అవగాహన పెంపొందించుకోవాలని పట్టణ అగ్నిమాపక శాఖ అధికారి పైడిరాజు అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా శనివారం పట్టణంలో ఆర్టీసీ కాంప్లెక్స్ తదితర ప్రాంతాల్లో అగ్ని ప్రమాదాలపై అవగాహన కార్యక్రమాలు ప్రయోగాత్మకంగా వివరించారు. ఈ సందర్భంగా అగ్నిప్రమాదాలు ఏ విధంగా సంభవించే అవకాశం ఉంది, తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర అంశాలను కూలంకుషంగా వివరించారు. ప్రమాదాలకు సంబంధించి నివారణ చర్యలపై కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆర్టీసీ, అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

ఖరీఫ్ ప్రణాళికలు సిద్ధం



మాట్లాడుతున్న ఏఓ అవినాష్

సీతానగరం: రాబోయే ఖరీఫ్ సీజన్‌లో రైతులకు అవసరమైన విత్తనాలు సమకూర్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్టు ఏఓ ఎస్.అవినాష్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ ప్రసాద్ అధ్యక్షతన మండల వ్యవసాయ సలహా కమిటీ సమావేశం శనివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2023 ఖరీఫ్‌లో పచ్చిరొట్ట, వరి విత్తనాలు ముందస్తు ప్రణాళికలతో ఆర్‌బీకేల ద్వారా రైతులకు పంపిణీ చేయడానికి అవసరమైన నివేదికలు తయారు చేయాల్సి ఉందన్నారు. రైతులకు అవసరమైన విత్తన రకాల కోసం ముందుగా తెలియజేయాలని కోరారు. భూసార పరీక్షలకు సంబంధించి వ్యవసాయ సహాయకులకు రైతులు సహకరించాలని అన్నారు. అన్ని ఆర్‌బీకేల్లో గ్రీవెన్స్ పోర్టర్ అందుబాటులో ఉందని రైతులు ఆన్‌లైన్ చేసుకోవాలన్నారు. ఎంపీపీ ప్రతినిధి బి.శ్రీరాములు, జెడ్పీటీసీ మామిడి బాబ్జీ, లచ్చయ్యపేట సర్పంచ్ సీహెచ్ కృష్ణ పాల్గొన్నారు.

కిసాన్ డ్రోన్ యంత్ర సేవా కేంద్రాలు వినియోగించుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ రవికుమార్

బలిజిపేట: రైతులు, యువకులు కిసాన్ డ్రోన్ యంత్ర సేవా కేంద్రాలను వినియోగించుకోవాలని జెడ్పీటీసీ ఎ.రవికుమార్ అన్నారు. ఎంపీడీఓ కార్యాలయంలో వ్యవసాయ సలహా మండలి సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసక్తి కలిగిన రైతులు, రైతు భరోసా కేంద్రాల పరిధిలో ఉండేవారు గ్రూపులను ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. ఈ గ్రూపులో డ్రోన్ ఎగురవేయుటకు శిక్షణ తీసుకున్న సభ్యులు ఉండాలని, డ్రోన్ పైలట్‌గా గ్రామీణ నిరుద్యోగ యువత అభ్యర్థి ఎంపిక చేయాలని, అందుకు తగిన అర్హతలు ఉండాలన్నారు. బీఎస్సీ అగ్రికల్చర్ ఇంజినీరింగ్, డిప్లమో అగ్రికల్చర్, డిప్లమో, ఇంజినీరింగ్ పట్టబధ్రులు, డిప్లమో ఇంజినీరింగ్ చదివిన వారు ఉండాలన్నారు. డ్రోన్‌లు పురుగు మందులు, ఎరువులు పిచికారీ చేయడానికి ఉపయోగపడతాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం డ్రోన్ వ్యవసాయంపై దృష్టి సారిస్తున్నందున రైతులు దీనిని ఉపయోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో సలహా సంఘం అధ్యక్షుడు గంగయ్య, ఏఓ శ్రావణ్, సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

మంచినీటి బోర్లకు మరమ్మతులు



తామరకండిలో బోరు మరమ్మతులు చేస్తున్న మెకానిక్‌లు

సీతానగరం: ఎండలు తీవ్రం కావడంతో ప్రజావసరాలకు అనుగుణంగా బోర్లు, మంచినీటి పథకాలు, ఇంటింటి కుళాయిల ద్వారా తాగునీరు సరఫరాకు చర్యలు చేపడుతున్నామని ఎంపీడీఓ ఎంఎల్ఎన్ ప్రసాద్ అన్నారు. క్రాష్ కార్యక్రమం సామగ్రిని ఎంపీపీ ప్రతినిధి బి.శ్రీరాములు, జెడ్పీటీసీ ఎం.బాబ్జీ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ మండలంలో 18 మంచినీటి పథకాలు, 548 బోర్లు ఉన్నాయని తెలిపారు. గ్రామాల్లో తాగునీటి ఎద్దడి ఉన్నట్టు గుర్తించి బోరుమెకానిక్‌లతో గ్రామాల్లో బోర్లకు ఏప్రిల్ 1 నుంచి మరమ్మతులు చేపడుతున్నట్టు వెల్లడించారు. ఇప్పటి వరకు వంద బోర్లుకు మైనర్ మరమ్మతులు చేయించినట్టు తెలిపారు. ఇప్పటికే పెదబోగిలి, జోగింపేట గ్రామాల్లో మంచినీటి సమస్య పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకున్నట్టు చెప్పారు. వారి వెంట బోరు మెకానిక్ సత్యనారాయణ, సహాయకుడు కృష్ణ తదితరులు ఉన్నారు.

జన సంక్షేమమే జగన్ ధ్యేయం



నారాయణపురంలో లబ్ధిదారుకు బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే జోగారావు

- ఎమ్మెల్యే జోగారావు

బలిజిపేట: ప్రజా సంక్షేమమే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. మండలంలోని నారాయణపురంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఇంటింటా తిరిగి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు ఎమ్మెల్యే వివరించారు. ఇటువంటి సంక్షేమ పథకాలను అందిస్తున్న సీఎం జగన్‌మోహన్ రెడ్డిని ఆశీర్వదించి తిరిగి అధికారంలోకి తీసుకురావాలన్నారు. సంక్షేమ పథకాలు ఎంత వరకు సంతృప్తి కలిగించాయనేది ప్రజలను అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ పథకాల అమలులో ఎటువంటి పొరపాట్లు ఉన్నా వాటిని తెలియపరచాలన్నారు. అర్హులైన వారికి పథకాలు అందకపోతే తెలియపరచాలన్నారు. రాష్ట్రంలో నిరుపేదలు, బడుగు, బలహీన వర్గాల ప్రజలలో ఆనందం నింపాలని ముఖ్యమంత్రి అహర్నిశలు పాటుపడుతున్నారని పేర్కొన్నారు. పార్టీలకు అతీతంగా పథకాలు అందించడమే ఆయన లక్ష్యమన్నారు. పథకాలు పొందేందుకు అర్హతే ప్రామాణికమన్నారు. అర్హులైన వారందరికి నవరత్నాలు అందుతున్నాయా అనేది వారిని అడిగి తెలుసుకున్నారు. అన్ని విధాల సంక్షేమాన్ని అమలు పరుస్తున్న సీఎం జగన్‌మోహన్ రెడ్డిని ఆశీర్వదించాలని కోరారు. రానున్న ఎన్నికలలో పార్టీని విజయపథంలో నడిపించాలన్నారు. వలంటీర్లు, సచివాలయ సిబ్బంది ప్రజల సంక్షేమం కోసం పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ రామకృష్ణ నాయుడు, ఎంపీడీఓ భానుమూర్తి, ఎంపీపీ నాగమణి, జెడ్పీటీసీ ఎ.రవికుమార్, మండల ఉపాధ్యక్షుడు వి.సాయిరాం, మండల పార్టీ అధ్యక్షుడు పి.మురళీకృష్ణ, మాజీ జెడ్పీటీసీ రాధ, ఎంపీటీసీ శ్రీరామూర్తి, బలిజ కార్పొరేషన్ డైరక్టర్ శ్రీనివాసరావు, పలగర సహకార సంఘం అధ్యక్షుడు జి.పకీరునాయుడు, సర్పంచ్‌లు ఆర్.శ్రీనివాసరావు, ఎస్.పాపారావు, సుందరరావు, కె.మోహనరావు, ఎంపీటీసీ ఎం.సాంబమూర్తి, మాజీ సర్పంచ్‌లు ప్రసాదు, డి.అప్పన్న, ఎం.దుర్గేశ్వరి, ఎం.శ్రీనివాసరావు, కె.వెంకటరమణ, జగన్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పరిమితికి మించితే చర్యలు తప్పవు



వాహన చోదకులకు అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ ఎస్ఐ పాపారావు

పార్వతీపురం టౌన్: పరిమితికి మంచి లోడ్ ఉంటే చర్యలు తప్పవని ట్రాఫిక్ ఎస్ఐ పాపారావు అన్నారు. పట్టణంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ కూడలి వద్ద నో యాక్సిడెంట్ డే కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా వాహన చోదకులకు, ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ విధిగా ట్రాఫిక్ నియమాలు పాటించాలన్నారు. ఆటోలు నడిపేటప్పుడు పరిమితికి మంచి లోడ్ ఉంటే కఠినంగా వ్యవహరిస్తామన్నారు. జాతీయ రహదారిపై రోడ్డు భద్రతా, రక్షణ, అతి వేగం వంటి విషయాలపై సంకేత బోర్డులతో అవగాహన కల్పించారు. రహదారిపై ద్విచక్ర వాహనాలు నడుపుతున్న వారు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదని ఎక్కువ స్పీడ్‌తో వెళ్లరాదని, తప్పనిసరిగా రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని సూచించారు. ఆటో డ్రైవర్‌లకు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ వాహనాలు నడపాలని సూచించారు. వాహనాలు నడిపేటప్పుడు ధ్రువపత్రాలు వెంట ఉంచాలన్నారు. ఓవర్ లోడ్‌తో వాహనాలు నడవరాదని హెచ్చరించారు. సరుకు రవాణా వాహనాలలో ప్రజా రవాణా చేసిన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో సిబ్బంది ఏఎస్ఐ రాజారావు, కిషోర్, సంపత్, ఆటో డ్రైవర్‌లు, వాహన చోదకులు తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో చేరిన ఉపాధ్యాయులు

గుమ్మలక్ష్మీపురం: మండలంలో 1998 డీఎస్సీ ద్వారా నియామకాలు పొందిన 33 మంది ఉపాధ్యాయులు విధుల్లో చేరినట్లు ఎంఈఓ జె.నారాయణస్వామి తెలిపారు. శనివారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ మొత్తం 36 మందికి గాను 33 మంది విధుల్లో చేరారని, దీంతో మండలంలో ఉపాధ్యాయుల కొరత తీరిందని, విద్యార్థులకు మెరుగైన విద్య అందనుందన్నారు.